క్లుప్తంగా

ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలి

పెనమలూరు: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సివిల్ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని క్యాడ్ డైరెక్టర్ కె.నాగు అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ప్రైమవేరా సాఫ్ట్‌వేర్‌పై శిక్షణలో ఆయన ప్రసంగించారు. సివిల్ విభాగంలో భవనాలు, రోడ్ల నిర్మాణంలో సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించేందుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. సివిల్ విభాగంలో ప్రైమవేరా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి సాంకేతికతో నిర్మాణాలు చేసి దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీ బాబు, సివిల్ విభాగాధిపతి డాక్టర్ వి.జగదీష్, క్యాక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ కోగంటి శ్యామ్ ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

డిజిటల్ ఇండియాపై అవగాహన ర్యాలీ

పొట్టిపాడు(గన్నవరం): ఉంగుటూరు మండలం పొట్టిపాడు గ్రామంలో సోమవారం ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో డిజిటల్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి డిజిటల్ చెల్లింపుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకేఎస్ వీ.ప్రసాద్ మాట్లాడుతూ.. డిజిటల్ ఇండియా ఉద్యమం గ్రామీణ ప్రాంతాల్లో సమాచార సాంకేతిక వినియోగాన్ని పెంపొందిస్తుందన్నారు. తద్వారా ప్రజలకు పారదర్శకమైన, సులభమైన సేవలను అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. పలు యూపీఐ యాప్‌ల ద్వారా డిజిటల్ పేమెంట్ విధానం, వాటి సౌలభ్యం, భద్రత చర్యలపై ప్రజలను వివరించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆన్‌లైన్ సేవలు, బ్యాంకింగ్ సేవల గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రీహరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు


కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 23వ తేదీ నుంచి ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.బసవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో ఉప్పులూరు, గొడవర్రు సచివాలయాలు, 25, 26 తేదీల్లో ప్రొద్దుటూరు, పునాదిపాడు-1 సచివాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తారన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న ఏటిపాయ

కంకిపాడు: ఏటిపాయ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ప్రకాశం బ్యారేజీకి వరదనీరు వచ్చిచేరటంతో ఇరిగేషన్ అధికారులు బ్యారేజీ గేట్లు తెరిచి ఏటిపాయలకు నీటిని విడుదల చేశారు. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల పరిధిలోని ఏటిపాయ వరదనీటితో పరవళ్లు తొక్కుతోంది. సముద్రం వైపు వరద నీరు ప్రవహిస్తోంది. ఏటిపాయ అంచులు తాకుతూ వరదనీరు సాగుతోంది. కాసరనేని వారిపాలెం వద్ద ఏటి ఒడ్డున ఉన్న శివాలయం చుట్టూ వరదనీరు చేరింది. మత్స్యకారులు ఏటి ఒడ్డున చేపల వేట సాగిస్తూ ఉపాధి పొందుతున్నారు. మద్దూరు వద్ద ఏటి ఒడ్డున నిలిపి ఉంచిన పలు పడవలు వరదనీటి ఉధృతికి దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పడవల మరమ్మతులు చేపట్టేందుకు మత్స్యకారులు నానా తంటాలు పడుతున్నారు.

జీఎస్‌టీ 2.0తో మారుతి కార్ల ధరలు తగ్గింపు

మారుతి సీఎండీ హిసాషిటకేచి



పెనమలూరు: కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ 2.0 అమలులోకి తీసుక రావటంతో మారుతి సుజుకి కార్ల ధరలు తగ్గాయని కంపెనీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ హిసాషిటకేచి తెలిపారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరు ప్రముఖ మారుతి సుజుకి డీలర్ సంతోష్ మారుతి షోరూమ్‌లో సోమవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. జీఎస్‌టీ 2.0తో మారుతి కార్ల ధరలు రూ.1.29 లక్షల వరకు తగ్గాయన్నారు. కస్టమర్లకు ధరలు అందుబాటులోకి రావటంతో కొత్త మారుతి కార్ల కొనుగోలుకు మంచి అవకాశం ఏర్పడిందన్నారు. కొత్త ఈవీ కార్ల శకం ప్రారంభమవుతుందన్నారు. ఏపీలో మారుతి సేల్స్ బాగున్నాయని, ఈవీ కార్లకు కావల్సిన మౌలికవసతులు అందుబాటులోకి తీసుకు వస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో ఏపీలో మారుతి మరిన్ని అవుట్‌లెట్స్ అందుబాటులోకి వస్తాయన్నారు. ధరల తగ్గింపుతో పాటు పండుగ ఆఫర్లు కూడా ప్రకటించామన్నారు. కస్టమర్లకు మరిన్ని ఆధునిక మోడల్స్ మార్కెట్‌లోకి తీసుకు వస్తామని వివరించారు. మారుతి సుజుకి సీనియర్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ పార్థోబెనర్జి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ తగ్గించటం వలన కార్ల మార్కెట్ బాగుంటుందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ సుయోషిట కేషిత, సర్వీస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామ్‌సురేష్ అంకెళ్ల, మారుతి సుజుకి ఎక్స్‌వైస్ ప్రెసిడెంట్ శిరాషిటకహిరో, సంతోష్ మారుతి సుజుకి షోరూమ్ మేనేజర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


యనమలకుదురు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో..


మద్దూరులో బాలా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు


ఈడుపుగల్లు ఆంజనేయస్వామి దేవస్థానంలో..


కంకిపాడులో బాలా త్రిపుర సుందరీదేవిగా వాసవీ మాత


ఉయ్యూరు శివాలయంలో జగదాంబదేవిగా..


ఉయ్యూరు విజయ దుర్గాదేవి ఆలయంలో బాలా త్రిపుర సుందరీ దేవిగా..

సర్వత్రా దసరా సందడి

- గ్రామాలలో అమ్మవారి విగ్రహాల ఏర్పాటు
- ప్రత్యేక పూజలు ప్రారంభించిన భక్తులు
- బంధుమిత్రుల రాకతో కళకళలాడుతున్న ఇళ్లు

పెనమలూరు: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ గ్రామాన పత్యేక మండపాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి తొలిరోజు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు ప్రారంభించారు.

పెనమలూరు మండల పరిధిలో మొదటి రోజు అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. యనమలకుదురు శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలోని పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఉత్సవాలు ప్రారంభించారు. పోరంకి గ్రామ దేవత గంగానమ్మ గుడి వద్ద అమ్మవారి విగ్రహాన్ని భక్తులు ఏర్పాటు చేశారు. భక్తులు భవానీ మాల ధరించి అమ్మవారికి పూజలు చేశారు. ఈ నెల 26న కోటి దీపోత్సవం చేస్తారు. 27న లక్ష కుంకుమార్చన పూజలు ఉంటాయి. పెనమలూరు సీతారామాలయంలో ఉత్సవాలను ప్రారంభించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. పోరంకి షిరిడి సాయిబాబా మందిరంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. అక్టోబర్ 3న 107 పుణ్యతిథి పూజల్లో భాగంగా 107 జ్యోతులతో సమాధి ఉత్సవం నిర్వహిస్తారు. చోడవరం నాగేంద్రస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.


గండిగుంట రాయల్ వంశీస్‌లో..


ఉప్పలూరులో పూజలు చేస్తున్న భవానీమాలధారులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో సోమవారం నుంచి దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు పేరంటాలమ్మ భక్తులకు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈవో పి.ప్రియాంక పర్యవేక్షించారు.

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వేడుకలను మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధన రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కాసరనేని బాబూరావు, బేబీసరోజిని దంపతులు కలశస్థాపన జరిపారు. అనంతరం అమ్మవారిని బాలాత్రి పురసుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. కాసరనేని నాని, స్వరాజ్య ధనలక్ష్మి దంపతుల సౌజన్యంతో భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, సభ్యులు పాల్గొన్నారు. స్థానిక సొసైటీపేటలోని గాయత్రీమందిరంలో బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మందిర కమిటీ అధ్యక్షుడు కేవీఆర్.కిషోర్, నాగమణి దంపతుల నేతృత్వంలో గోపూజ, కుంకుమార్చనలు, బాలమూలమంత్ర హోమం నిర్వహించారు. యాదవులపేట రామాలయంలో కుంకుమార్చనలు జరిపారు. స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానం, కనకదుర్గమ్మ ఆలయం, పెద్దమ్మతల్లి ఆలయాల్లో ఉత్సవాలు జరుగుతున్నాయి.

నున్న(విజయవాడరూరల్): మండలంలోని చినకంచిలో మొదటి రోజున కామాక్షి పరాభట్టారికా దేవిగా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. నున్న గ్రామ చెరువు సెంటర్లో కనకదుర్గాదేవి దేవస్థానంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి పూజలు చేసి ఆశీస్సులు పొందారు. కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అన్నపూర్ణాదేవి బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీసాయిబాబా మందిరంలో అమ్మవారు భక్తులకు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. అంబాపురం గ్రామంలోని కనకదుర్గాదేవి దేవస్థానంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులు పూజలు చేశారు. మంగళాపురం రామాలయంలో, అప్పారావుపేట గంగానమ్మ గుడి దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవార్లు బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో పూజలు నిర్వహించారు.

ఉయ్యూరు: దేవీ శరన్నవరాత్రులు తొలిరోజు సోమవారం అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా పూజలందుకున్నారు. ఉయ్యూరులోని విజయ దుర్గాదేవి ఆలయం, గండిగుంటలోని రాయల్ వంశీస్, చిన ఓగిరాలలో బాలా త్రిపుర సుందరీదేవిగా, ఉయ్యూరు శివాలయంలో రజిత కవచాలంకృత జగదాంబ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కంకిపాడు: దేవీ శరన్నవరాత్రులు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. కంకిపాడు, ఈడుపుగల్లు, ప్రొద్దుటూరు, మద్దూరు, ఉప్పలూరు గ్రామాల్లో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఉప్పలూరులో గురుభవానీ కొండవీటి శివయ్య ఆధ్వర్యంలో భవానీమాలధారులు విశేష పూజా కార్యక్రమాలు జరిపించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, ఐటీఐ రోడ్డులోని శ్రీభమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానం, ఏలూరు రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, మహాత్మగాంధీనగర్, ఎన్టీఆర్ కాలనీల్లో మండపాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు అమ్మవారు భక్తులకు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు.


పోరంకి గంగానమ్మ గుడి వద్ద అమ్మవారికి పూజలు


పాతగన్నవరంలో అమ్మవారికి పూజలు



సొసైటీపేటలో గాయత్రీ మందిరంలో కుంకుమార్చన


చినకంచిలో కామాక్షి అమ్మవారి అలంకారం


పెనమలూరు సీతారామాలయం వద్ద అమ్మవారు


చెరువు సెంటర్లో శ్రీకనకదుర్గమ్మ దేవస్థానంలో..


హనుమాన్‌జంక్షన్‌లోని శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానంలో..


పోరంకి షిరిడి సాయిబాబా మందిరంలో..


రామవరప్పాడులో బాలాత్రిపురసుందరీదేవిగా పేరంటాలమ్మ

జాతీయ రహదారి పక్కన చెత్తను తొలగించాలి

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

గన్నవరం: స్థానిక చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తచెదారాన్ని వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. స్థానిక కొత్తపేట వద్ద జాతీయ రహదారి పక్కన డంప్ చేసిన చెత్తచెదారం, వర్షపు నీటి నిల్వలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి మార్గంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొని, తీవ్ర దుర్గంధం వెదజల్లేలా ఉంచటం సరికాదన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా తాత్కాలికంగా పైపులైన్లు ఏర్పాటు చేసి బయటకు తరలించాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారి మార్గంలో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలను వెంటనే తొలగించాలని, ఈ ప్రాంతంలో చెత్త డంపింగ్ చేయకుండా పర్యవేక్షించాలని చెప్పారు. ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, డీపీజీ డాక్టర్ జె.అరుణ, గుడివాడ ఆర్డీఓ జీ బాలసుబ్రమణ్యం, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణరావు, ఎన్‌హెచ్ ఈఈ నాగేశ్వరరావు, తహసీల్దారు కేవీ శివయ్య, ఎంపీడీఓ టి.స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.


జాతీయ రహదారి పక్కన చెత్తను పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

చెత్త వేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోండి

కంకిపాడు: గ్రామ సరిహద్దుల్లో చెత్త వేస్తున్న వ్యక్తులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. గన్నవరం పర్యటనకు వెళ్లిన ఆయన మచిలీపట్నం వెళ్తూ ఉప్పలూరు పరిధిలోని బుడమేరు వద్ద ఉప్పలూరు, కేసరపల్లి సరిహద్దుల్లో చెత్త, వ్యర్థాల గుట్టలను సోమవారం పరిశీలించారు. ఉప్పలూరు, కేసరపల్లి పంచాయతీ కార్యదర్శులు బి.వెంకటేశ్వరరావు, ప్రసాద్‌లను చెత్త డంపింగ్‌పై వివరాలు తెలుసుకున్నారు. జన సంచారం లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వ్యర్థాలు, చెత్త తీసుకువచ్చి డంపింగ్ చేస్తున్నట్లు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ చెత్త, వ్యర్థాలు పోస్తున్న ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అపరాధ రుసుము సైతం విధించాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, అప్పుడే వ్యాధులు దరిచేరవన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు

గన్నవరం రూరల్: యూరియా సరఫరాపై రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. సోమవారం పురుషోత్తపట్నం పీఏసీఎస్‌ను ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. గిడ్డంగి గుమస్తాను ఇప్పటి వరకూ ఎంత యూరియా వచ్చిందని కలెక్టర్ ప్రశ్నించారు. 15 టన్నులు వచ్చిందని సమాధానం చెప్పగా రైతులతో మాట్లాడుతూ వారం రోజుల్లో యూరియాను సరఫరా చేస్తారని చెప్పారు. వరి పంటకు ఇప్పటికీ రెండు సార్లు యూరియా వేశామని, మూడో సారి వేయాల్సి ఉందని స్థానిక రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తహసీల్దార్ కేవీ శివయ్య పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణపై శ్రద్ధ అవసరం

పెనమలూరు: చిన్నారులపట్ల తల్లులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ కానూరు సెక్టార్ సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా సోమవారం కానూరు 11,17 అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్‌లో చిన్నారులకు చదువు పట్ల ఆసక్తి పెంచాలని సూచించారు. పీపీ1, పీపీ2, చిన్నారులకు వాట్సాప్ గ్రూపులతో తల్లితండ్రులకు చిన్నారుల వివరాలు పంపుతామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

వణుకూరులో..

వణుకూరులో జరిగిన కార్యక్రమంలో తల్లులు పాల్గొన్నారు. 0- 3 సంవత్సరాల పిల్లల పోషణపై తల్లులకు అవగాహన కల్పించారు. ఆటపాటల విద్య నేర్పి స్తామన్నారు. గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో సోమవారం పోషకాహార ప్రదర్శనను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస రావు ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వనజ, రాజేశ్వరి, నాగలక్ష్మి, అనిత, ఝాన్సీ, కృష్ణవేణి, రంగమ్మ, ఎంఎస్‌కేలు శ్రావణి, మాధవి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చూడాలని ఐసీడీఎస్ కంకిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి సూచించారు. దావులూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అన్నామణి మాట్లాడుతూ చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదలకు పోషకాలు దోహదపడతాయన్నారు. మూడుసంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

సందడిగా సాగిన ఫన్ ఫీల్డ్ డ్యాన్స్

పెనమలూరు: కానూరు సిద్ధార్థ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో సోమవారం స్టెప్ అండ్ స్పిన్- 2025 కార్యక్రమాన్ని సంస్కృతి కల్చర్ అండ్ లిటరరీ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫన్ ఫీల్డ్ డ్యాన్స్ ఈవెంట్ సందడిగా జరిగింది. ఉపకులపతి ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు, ప్రో ఉపకులపతి డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్,విద్యార్థినులు కోలాటం, దాండియా వంటి సంప్రదాయ నృత్యాలు చేశారు. దాదాపు 175 మంది విద్యార్థులు పలు రకాల డ్యాన్స్‌లు, నృత్యాలు చేశారు. రిజిస్ట్రార్ ఎం.రవిచంద్, కన్వీనర్ డాక్టర్ బి. నీలాంబరం, ఏవో సాయిబాబు, కేశవరావు పాల్గొన్నారు.

దెబ్బతిన్న అరటి తోటల పరిశీలన

పెనమలూరు: మండల పరిధిలో ఆదివారం రాత్రి ఈదురు గాలులతో వర్షం పడటంతో అరటి తోటలు నేలకూలాయి. దీంతో పంట నష్టం జరిగిందని రైతులు ఆందోళణ చెందుతున్నారు. మండల పరిధిలో దాదాపు 60 ఎకరాల అరటి తోటలు దెబ్బతిన్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో అరటి పంట పూర్తిగా దెబ్బతిందని రైతులు తెలిపారు. ఉద్యాన అధికారి హరిచంద్ మాట్లాడుతూ అరటి తోటలను పరిశీలించామన్నా రు. పెనమలూరు, పోరంకి, గోసాల గ్రామాలలో అరటి తోటలు ఈదురు గాలులకు దెబ్బతిన్నాయన్నారు. పంట నష్టం వివరాలు నమోదు చేసి నివేదిక పంపుతామన్నారు. ప్రభుత్వం నుంచి రైతులకు సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

90 ఎకరాల్లో పంట నష్టం

కంకిపాడు: ఈదురుగాలులు, భారీ వర్షంతో పంట నష్టం వాటిల్లిన ప్రాంతాల్లో ఉద్యానశాఖ అధికారి ఈ.హర్‌చంద్ సోమవారం పర్యటించారు. పెనమలూరు, పోరంకి, ఈడుపుగల్లు, దావులూరు, ప్రొద్దుటూరు తదితర గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న అరటి, ఇతర పంటలను పరిశీలించారు. హర్‌చంద్ మాట్లాడుతూ ప్రాథమిక అంచనాల మేరకు అరటి తోటలకు నష్టం వాటిల్లిందని, 90 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వివరించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. రైతులకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.


ఈడుపుగల్లులో అరటి పొలాన్ని పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి ఈ.హర్‌చంద్

నేడు వైద్య శిబిరం

కంకిపాడు: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో ఈనెల 23న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు యార్లగడ్డ సుందరయ్య తెలిపారు. గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించే ఈ శిబిరంలో గుండె, చిన్నపిల్లలు, మహిళల ఆరోగ్య సమస్యలపై పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని తెలిపారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీబీఎస్ఈ సిలబస్ రద్దు తగదు

గన్నవరం: ప్రభుత్వ పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్‌ను రద్దు చేయడం అంటే దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల పిల్లలకు ఉన్నత విద్యను దూరం చేయడమేనని గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలజబెత్‌రాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదల తలరాతను మార్చే సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో కుటమి ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ, ఐబీ వైపు అడుగులు వేస్తూ టోఫెల్ విద్య, డిజిటల్ క్లాస్ రూమ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యను వ్యాపారంగా మార్చేసిందన్నారు. సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రభుత్వ పాఠశాలలో రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పీఎం జేజేవై బీమా చెక్కుల పంపిణీ



ఉయ్యూరు: ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ బ్యాంకు ఉయ్యూరు బ్రాంచ్ మేనేజర్ ఏ.అజయ్‌కుమార్ కోరారు. బ్రాంచి పరిధిలో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం కింద లబ్ధిదారులకు సోమవారం చెక్కులు అందజేశారు. అబ్దుల్ మాలిన్, కనకదుర్గ, రాజ్యలక్ష్మి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు వంతున బీమా చెక్కులు అందించారు. మేనేజర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ బీమా చెక్కులు పొందిన కుటుంబ సభ్యులు వ్యవసాయ పొలం పనులు చేసుకుని జీవిస్తారన్నారు. వివిధ కారణాలతో చనిపోయిన కుటుంబాలకు ఇండియన్ బ్యాంకులో ఖాతాలు ఉన్నాయన్నారు. బీమా యోజన పథకం కింద ఏడాదికి రూ.436 ప్రీమియంగా చెల్లిస్తే ఈ పథకం వర్తిస్తుందన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక అక్షరాశ్యత కేంద్రం కంకిపాడు కౌన్సిలర్ సునీల్, హేమారావు అవగాహన కల్పించి, బీమా వర్తింప చేయటంలో సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.